క్లుప్తంగా

రేపు ఉగాది కవి సమ్మేళనం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొత్త శివ

పెద్దాపురం: స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహితి స్రవంతి కార్యదర్శి కొత్త శివ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పెద్దాపురం సాహితి స్రవంతి, యూటీఎఫ్, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సాహిత్య సభ, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు. కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివ కోరారు.

బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు


గాయంతో బాధపడుతున్న మహిళ

పెద్దాపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు బంగారమ్మ గుడివీధికి చెందిన బత్తిన భారతి (55) పని నిమిత్తం నడిచి వెళ్తుండగా మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ బొమ్మ వద్ద నల్లమిల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సు ఆమె కాలి మీద నుంచి వెళ్లడంతో తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను వెంటనే పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు అందించాలి


శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పిఠాపురం: పిల్లల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి సూచించారు. మండలం చిత్రాడ జెడ్పీ హై స్కూల్‌లో మండల స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన పోషణ్ భీ.. పడాయీ భీ కార్యక్రమంలో పొందిన శిక్షణను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మణి పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి


చేబ్రోలులో ఆన్‌లైన్ పనులను పరిశీలిస్తున్న డీపీఓ రవి కుమార్

పిఠాపురం: గ్రామ పంచాయతీల్లో జీపీడీపీ ఆన్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని డీపీఓ రవి కుమార్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం మూడు పంచాయతీల్లోనే ఆన్‌లైన్ పనులు పూర్తయ్యాయని మిగిలిన 7 పంచాయతీల్లో వెంటనే పూర్తి చేయాలని ఆయన ఈఓపీఆర్‌డీ కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలో వ్యక్తి మృతి


విగతజీవిగా ప్రతీప్

కాకినాడ క్రైం: స్థానిక బాలాజీ చెరువులోని వసుధ లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణా జిల్లా రాయనగరం గ్రామానికి చెందిన పాతపాటి ప్రతీప్ (41) బాంబినో సేమియా కంపెనీలో ఏరియా సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కాకినాడలో ఉన్న డిస్ట్రిబ్యూటర్లను కలిసేందుకు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి వస్తుంటాడు. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ నుంచి కాకినాడకు వచ్చి వసుధ లాడ్జిలో దిగాడు. బుధవారం రాత్రి గదిలో మద్యం సేవించాడు. ఉదయం రూం బాయ్ చూసే సరికి విగత జీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రాసానికి గ్రహణం

- గడ్డి కొరతతో అల్లాడుతున్న రైతులు
- కోతల్లో యాంత్రీకరణతో ఈ పరిస్థితి
- ఎకరం గడ్డి కొనుగోలు రూ.10వేల పైనే
- గడ్డి విత్తనాలు ఇవ్వాలంటున్న పాడి రైతులు


యంత్రంతో సాగుతున్న వరి కోతలు

సామర్లకోట: సుఖం ఉన్న చోట.. నష్టం కలుగుతుందనే సామెత రైతులకు పూర్తిగా వర్తిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం అమలులోనికి రావడంతో వరి కోత కోసం యంత్రాలు అందుబాటులోనికి వచ్చాయి. దాంతో రైతులు వెంటనే తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి యంత్రాలతో వరి కోత చేసుకొంటున్నారు. దీంతో ఎండు గడ్డికి కొరత ఏర్పడుతోంది. పాడి ఉన్న రైతులకు గడ్డి లభించక పశువులు అల్లాడుతున్నాయి. వరి పంట కోతకు వచ్చిన సమయంలో ఎకరానికి 10 మంది కూలీలకు రూ. ఆరు వేలు, వరి పనలు తిరగవేతకు ఇద్దరు కూలీలకు రూ.1,200, కుప్ప వేయడానికి ఇద్దరు కూలీలకు రూ.1,200, ధాన్యం నూర్పిడి చేసి ఇంటికి చేర్చడానికి రూ.ఏడు వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెప్తున్నారు. అదే యంత్రంతో ధాన్యం ఇంటికి చేర్చడానికి ఎకరానికి రూ. ఐదు వేలు ఖర్చు చేస్తే సరిపోతుంది. యంత్రంతో వరి కోత వల్ల ఎకరానికి సుమారు రూ.10వేల వరకు ఆదాతో పాటు సమయం కూడా కలిసొస్తుంది. మరో విధంగా చూస్తే చెప్పిన మాట వినకపోవడం, తీరిగ్గా పని చేయడం తదితర లోపాలతో కూలీలపై రైతులు అనాసక్తి ప్రదర్శిస్తున్నారు.

పాడి పరిశ్రమకు గండం

పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి ప్రజలకు స్వచ్ఛమైన పాలు అందించాలని భావించే వారికి గడ్డి కొరత ఒక గండంగా మారింది. నియోజకవర్గ పరిధిలో గడ్డి లభించక పోవడంతో కిర్లంపూడి, ఏలేశ్వరం, తుని, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి ఎండుగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ట్రాక్టర్‌పై ఎకరన్నర గడ్డి తీసుకురావడానికి రూ.15 వేలు తీసుకొంటున్నారని రైతులు చెప్తున్నారు. పొలం ఉన్న రైతులకు పచ్చగడ్డి అందుబాటులోనే ఉంటుంది. అయితే ఆ గడ్డి పశువులు తినడం వల్ల పాల చిక్కదనం తగ్గుతుందన్నది రైతుల వాదన. దీనికి తోడు పాలను డెయిరీలకు విక్రయిస్తే వెన్న శాతం తగ్గడం వలన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చగడ్డి తిన్న పశువుల పాలు పసరు వాసన వస్తాయని వారంటున్నారు. పొలంలోని గట్లపై ఉన్న పచ్చగడ్డి కోసే వారు కూడా కరువైపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


షెడ్డులో పశువుల పెంపకం

కష్టంగా మారిన డెయిరీ నిర్వహణ



నా తండ్రి ఆశయం మేరకు సుమారు రెండు ఎకరాల్లో పశువులు, కోళ్లతో డెయిరీ నిర్వహిస్తున్నా. పశువులకు ఎండు గడ్డి లభించక పోవడం వలన దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. నియోజకవర్గ పరిధిలో రైతులు వరి కోత యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఆ గడ్డిని పశువులు తినడం లేదు. ప్రభుత్వం గడ్డి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– తలారి దొరబాబు, పాల వ్యాపారి, వీకే రాయపురం

గడ్డి విత్తనాలు ఇవ్వాలి



గతంలో పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులకు గడ్డి విత్తనాలను ఇచ్చే వారు. పాడి ఉన్న రైతులు ముందు జాగ్రత్తగా కొంత మేర కూలీలతో వరి కోతలు చేసుకుని నూర్పిడి ద్వారా గడ్డిని ఏర్పాటు చేసుకొవాలి. పశువుల బాధ్యత పశుసంవర్ధక శాఖపై ఉంది.

– ఐ సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

రైల్వే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి


సామర్లకోట రైల్వే గేటు వద్ద ట్రాక్ పాయింట్లను పరిశీలించిన ఈడీ

- ఈడీ సేఫ్టీ తనిఖీ
- అధికారులకు పలు సూచనలు

సామర్లకోట: రైల్వే భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (న్యూఢీల్లీ) బీఎం తిరుపతి అన్నారు. గురువారం సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సిగ్నల్ వ్యవస్థ, రైల్వే కేబిన్లు, రైల్వే గేట్లు, రైలు ట్రాక్ జాయింట్‌లపై ఆయన తనిఖీలు చేశారు. రైల్వే ఆస్తులను కాపాడటంతో పాటు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. రాబోయే రోజులలో రైళ్ల వేగం మరింత పెరిగే అవకాశం ఉండడంతో పర్యవేక్షణ కీలకమన్నారు. స్టేషన్లలోని సమస్యలను తమ దృష్టికి తీసుకు రావడం ద్వారా బోర్డులో ఆమోదించి నిధులు మంజూరు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, రికార్డులను స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆయనకు వివరించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి



వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన తులసీకుమార్, రాజబాబు యాదవ్

బాలాజీచెరువు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, పార్టీ కాకినాడ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, కాకినాడ స్మార్ట్ సిటీ మాజీ అధ్యక్షుడు అల్లి రాజబాబు మర్యాద పూర్వకంగా కలిసారు. బలహీన వర్గాలకు అండగా నిలవాలని జగన్ సూచించారని వారు తెలియజేశారు.

మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్

పెట్రోలు బంకు యజమానికి కమిషనర్ హెచ్చరిక


పెట్రోలు బంకు యజమానితో మాట్లాడుతున్న కమిషనర్ ఇతర అధికారులు

సామర్లకోట: మొండి బకాయిలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో రెడ్ నోటీసులు జారీ చేశారు. ఏడీబీ రోడ్డులోని రెండు పెట్రోలు బంకుల యజమాని భారీ మొత్తంలో బకాయి ఉండడంతో గురువారం కమిషనర్ తన సిబ్బందితో కలిసి హెచ్చరిక జారీ చేశారు. తనకు ఉన్న భవనాన్ని కూల్చి వేసి ఖాళీ స్థలంగా మార్చినా ఇంటి పన్ను పంపుతున్నారని ఇది ఎంత వరకు సమజసమని బంకు యజమాని సత్యదేవ్ ఆమెను ప్రశ్నించారు. బకాయిలు చెల్లించిన సమయంలో వాటిని సర్దుబాటు చేస్తామని అతనికి ఆమె వివరించారు. అలాగే ఏడీబీ రోడ్డులోని పెట్రోలు బంకుకు రూ. ఆరు లక్షలకు మించి ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని నిర్లక్ష్యం చేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవలసి ఉంటుందని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ జట్ల మోహన్ బకాయిల చెల్లింపునకు రెండు రోజులు గడువు ఇవ్వాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేయడంతో గడువు ఇచ్చారు. ఆర్వో శ్యామల, ఆర్ఐ పి.సురేంద్రకుమార్, మేనేజరు కనకరాజు, బిల్లు కలెక్టర్ గిడుతూరి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది కమిషనర్ వెంట ఉన్నారు. పట్టణంలోని మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

మాజీ ఎంపీ గీత పరామర్శ

కొత్తపల్లి: వాకతిప్పకు చెందిన మాస్టర్ వీవర్ లొల్ల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకున్నారు. ఆయనను మాజీ ఎంపీ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ వంగా గీత గురువారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు తదితరులు ఉన్నారు.


సత్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వంగా గీత

విద్యుత్ లైన్లు మార్చరూ!


దళితపేటలో ఇళ్ల మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం శివారు కొత్తూరు దళితపేటలో ఇళ్ల మీదుగా విద్యుత్ తీగలు వెళ్తూ ప్రమాదకరంగా ఉన్నాయి. తీగలు మార్చాలంటే రూ.లక్షలు చెల్లించాలని ఆ ట్రాన్స్‌కో అధికారులు చెప్తుండడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెప్తున్నారు. 30 ఏళ్ల క్రితం పేదలకు పంపిణీ చేసిన స్థలాల్లో 25 ఏళ్ల క్రితమే అధికారులు విద్యుత్ లైన్లు వేసి 15 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే పంతం గాంధీమోహన్ చొరవతో 11 కేవీ విద్యుత్ లైన్‌గా మార్చారు. భవనాలకు సమీపంగా, కొన్ని చోట్ల ఇళ్ల పై నుంచి విద్యుత్ తీగలు వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని వారు చెప్తున్నారు. విద్యుత్తు లైన్ మార్చాలంటే సుమారు రూ.ఆరు లక్షలు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు అంచనాలు తయారు చేయడంతో పంచాయతీ అధికారులు చేతులెత్తేశారు. ఎమ్మెల్యే, ఎంపీలు జోక్యం చేసుకుని తీగలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి తీర్థం


భక్తులపై దున్నపోతును నడిపిస్తున్న భక్తురాలు


గరగ నృత్యాలు చేస్తున్నవారి కాళ్లు కడుగుతున్న భక్తురాలు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్‌లో పోలేరమ్మ తల్లి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దున్నపోతును తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి గరగ నృత్యాల మధ్య దానిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద బారుతీరి పడుకున్న భక్తుల పైనుంచి ఓ భక్తురాలు దున్నపోతును నడిపించింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. మండలం నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి కార్యక్రమాన్ని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మూలపేటలో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించారు.


అమీనాబాద్‌లో పోటెత్తిన భక్తులు

పి.వేమవరం ఉపసర్పంచ్ ఏకగ్రీవం


ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్టు వీర రాఘవమ్మకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి ఎంఎస్ఎన్ రెడ్డి

సామర్లకోట: మండల పరిధిలో పి.వేమవరం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామంలో 10 వార్డులు ఉండగా ఐదు కూటమి, ఐదింటిని వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. సర్పంచ్ పదవి వైఎస్సార్ సీపీకి దక్కడంతో ఆ పార్టీ మెజార్టీతో పాలన సాగుతోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీకి చెందిన వార్డు సభ్యురాలు మేడిద వీర రాఘవమ్మ కూటమిలో చేరారు. పంచాయతీ ప్రమాణ స్వీకారం సమయంలో కొంత కాలం అత్తిలి సుబ్బలక్ష్మి, మరికొంత కాలం మేడిది వీర రాఘవమ్మ ఉపసర్పంచ్‌లు పని చేయాలని నిర్ణయించారు. ఏడాది క్రితం సుబ్బలక్ష్మి ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికలల్లో భాగంగా ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. కూటమిలోనికి చేరిన మేడిద వీరాఘవమ్మకు ఉప సర్పంచ్ పదవి ఇవ్వాలని నిర్ణయించుకొవడం, వైఎస్సార్ సీపీ నాయకులు కూడా ఒప్పందం ప్రకారం ఆమెనే నిర్ణయించడంతో వైఎస్సార్ సీపీ పోటీ చేయడానికి ముందుకు రాలేదు. సర్పంచ్‌తో కలిసి ఐదు ఓట్లు, కూటమికి ఆరు ఓట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు పెదపూడి ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి ఉప సర్పంచ్ ఎన్నికకు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మూడో వార్డుకు చెందిన ముసిరెడ్డి రాంబాబు ఉప సర్పంచ్ పదవికి మేడిది వీర రాఘవమ్మను ప్రతిపాదించగా 8వ వార్డు సభ్యుడు అత్తిలి బాల సూర్యనారాయణ బలపర్చారు. ఎన్నికల అధికారి ఎంఎస్ఎన్ రెడ్డి సభ్యుల అభిప్రాయం కొరగా అందరూ చేతులెత్తి మద్దతు ఇవ్వడంతో వీరాఘవమ్మ ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ మేరకు ఆమెకు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. అనంతరం కూటమి నాయకులు విజయోత్సవాలు చేసుకున్నారు. డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణ భగవాన్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అభినందించనీయకుండా అవమానించారు...

ఉప సర్పంచ్‌గా ఎన్నికైన మేడిది వీర రాఘవమ్మను అభినందించాలని పూల దండ తీసుకు వచ్చామని, అయితే తనకు అవకాశం ఇవ్వకుండా కూటమి నాయకుల పార్టీ కార్యాలయానికి వెళ్లిపోయారని సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం ఆరోపించారు. ఈ విషయాన్ని ఆమె ఎన్నికల అధికారికి, పంచాయతీ కార్యదర్శి ఎల్.రాధాకృష్ణకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి నూకాలమ్మ తల్లి ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో కొలువైన నూకలమ్మ ఆలయంలో శుక్రవారం నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. శనివారం అమావాస్య నుంచి అమ్మవారి దర్శనం ఉంటుందని, ఆ రోజు స్థానిక జగ్గమ్మ గారిపేటలోని శెట్టిబలిజ కులస్తులు జాతర ఉత్సవం నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

రేపు కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: ప్రతి నెల జరిగే కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. పట్టణ పరిధిలోని అభివృద్ధి పనులపై చర్చించడానికి అజెండాలో 55 అంశాలను పొందుపరచినట్టు తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

హెచ్చరికలు బేఖాతరు


అనధికార లే అవుట్‌లో తొలగించిన ఫ్లెక్సీ


అనధికార లే అవుట్ వద్ద హెచ్చరికతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పంచాయతీ అధికారులు, వీఆర్వో (ఫైల్)

- అనధికార లే అవుట్‌లో అధికారులు పెట్టిన నోటీసుల తొలగింపు
- ఫ్లెక్సీ తొలగించిన లే అవుట్‌దారునిపై చర్యలు తీసుకుంటామన్న పంచాయతీ కార్యదర్శి

సామర్లకోట: అక్రమ లే అవుట్లపై అధికారులు తీసుకుంటున్న చర్యలను సైతం అధికార పార్టీ అండతో లేఅవుట్‌దారుడు దౌర్జన్యంగా తొలగించడం చర్చనీయాంశమైంది. మండల పరిధిలో ఉండూరు పంచాయతీ పరిధిలో అనధికార లే అవుట్‌లో ఈ నెల 21న అధికారులు హెచ్చరికగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఉండూరు శివారు నుంచి పి.వేమవరం వెళ్లే రోడ్డులో అధికారులు ఈ అక్రమ లే అవుట్‌ను గుర్తించి నిబంధనలు పాటించలేదని, 30 అడుగుల రోడ్లకు బదులు 20 అడుగులు మాత్రమే ఏర్పాటు చేయడం, కౌడా, పంచాయతీ అనుమతులు లేకపోవడం తదితర ఉల్లంఘనలపై అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. అక్రమ లేవుట్‌లో గజం రూ.ఆరు వేల నుంచి రూ.ఏడు వేలకు విక్రయాలు సైతం సాగిపోతుండడం గమనార్హం. దీనిపై పంచాయతీ కార్యదర్శి బుల్లియ్యకాపును వివరణ కోరగా సదరు లే అవుట్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని, దానిని తొలగిస్తే ఇనుప కమ్మీలతో బోర్డులు ఏర్పాటు చేసి, జిల్లా అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేస్తామని, అవసరం అయితే పోలీసుల సాయంతో లే అవుట్‌లో రాళ్లను తొలగిస్తామని తెలిపారు.